# సాక్షి
## కుమురం భీం

ఆదివారం : 29 : సెప్టెంబర్ : 2024






**లాఠీ ఎత్తారు..** 8లో ▸

రాణాలోనే ఇరువర్గాల దాడి చేసుకున్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై లాఠీ ఝళిపించారు. మరోవైపు రెండు వర్గాల అభియోగ దాడులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.



**నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు**

ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 33.1 /25.0

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 3 నుంచి శరన్నవరాత్రులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** అక్టోబర్ 3వ తేదీ గురువారం నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం అవుతాయని ధూప దీప నైవేద్యం అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ శనివా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7న లలిత పంచమి, 9న బుధవారం మూల నక్షత్రం సరస్వతీ పూజ, 11న శుక్రవారం దుర్గాష్టమి, మహానవమి, 12న శనివారం విజయ దశమి (దసరా)గా జరుపుకోవచ్చని ఆయన సూచించారు.

### నేడు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం సాయంత్రం 3.00 గంటలకు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉద్యమకారులు శ్రావణ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం హాజరవుతారని, జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

### విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



జానపద నృత్యంలో పాల్గొన్న విద్యార్థులు

**ఆసిఫాబాద్‌రూరల్:** విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కౌటాల కేజీబీవీ విద్యార్థులు రూ.1800, ద్వితీయ బహుమతి రెబ్బెన కేజీబీవీ విద్యార్థులు రూ.1200, తృతీయ బహుమతి చింతలమానెపల్లి విద్యార్థులు రూ.900 అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జూరీ మెంబర్లు వెంకట్రావు, సురేష్, ధర్మయ్య, హెచ్ఎం సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### భగత్‌సింగ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** దేశానికి స్వాతంత్ర్యం తీసుకవచ్చేందుకు ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారని, ప్రాణాలను సైతం అర్పించిన దేశ భక్తుడు భగత్ సింగ్ అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 సంవత్సరాల వయస్సులోనే ఉరికొయ్యను ముద్దాడి తన ప్రాణాలను అర్పించిన గొప్ప ధైర్యశీలి భగత్‌సింగ్ అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం దినకర్, రాజేందర్, మాలశ్రీ, శ్రావణి, నిఖిల్, చిట్టి పాల్గొన్నారు.

### సర్దుబాటును సవరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

**ఆసిఫాబాద్‌రూరల్:** ఉపాధ్యాయుల సర్దుబాటును సవరించాలని కోరుతూ యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో లోకేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో 25ను సవరించి సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికో టీచర్ ఉండాలని, ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మీడియం వారీగా లెక్కించాలన్నారు. అదనపు ఉపాధ్యాయులను 1:30 నిష్పత్తిలో లెక్కించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇందురావు, హేమంత్ షిండే, రమేశ్, శ్యామ్‌రావు, రవీందర్ పాల్గొన్నారు.

# 'షీ'వంగిలా మారాలి..



అమ్మా, చెల్లీ జర భద్రం... మదమెక్కిన మృగాళ్లు మన మధ్యే తిరుగుతున్నారు. మహిళలు.. బడికెళ్లే బాలికలు ఒంటరిగా ఎప్పుడు చిక్కుతారా అని గోతికాడి నక్కలా కామక్కుర్తునే నరరూప రాక్షసులు మనిషి ముసుగులో మన మధ్యే ఉంటున్నారు. మీరు ఆదమర్చినా.. అప్రమత్తంగా లేకపోయినా.. అదను చూసి కాటేస్తారు. అభం శుభం తెలియని పసికందులపై పైశాచికత్వాన్ని చూపించే కామాంధులూ లేకపోలేదు నేటీ సమాజంలో. మీకోసం ప్రభుత్వాలు ఎన్నో రక్షణ చట్టాలను తెచ్చినా.. మృగాళ్లకు ముకుతాడు పడటం లేదు. ఓ అబల ఎవరో వచ్చి రక్షిస్తారనో.. ఏదో అద్భుతం జరుగుతుందనో వేచి చూడకుండా 'షీ'వంగిలా మారాల్సిన సమయం వచ్చింది.

- కామాంధుల భరతం పట్టాలి
- జిల్లాలో పెట్రేగిపోతున్న మృగాళ్లు
- మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- రక్షణ చట్టాలున్నా శూన్యమే
- మూడేళ్లలో 72 రేప్ కేసులు.. 60 పోక్సో కేసులు నమోదు

**సాక్షి, ఆసిఫాబాద్:** జైనూరు ఘటన మరువక ముందే జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న బాలికపై మద్యం మత్తులో ఉన్న బొమ్మెన సాగర్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపగా.. శనివారం ఉదయం బాధితురాలి పాఠశాలకు చెందిన విద్యార్థులు, గ్రామస్తులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బూరుగూడ సమీపంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కామాంధుడిని కఠినంగా శిక్షించకపోతే శివంగిలా మారి నరికేస్తామని మృగాళ్లకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేయడం.. తల్లిదండ్రులు వారిస్తున్నా పోలీసులకు వాగ్మూలం ఇవ్వడానికి సైతం విద్యార్థినులు ముందుకురావడం చర్చనీయాంశమైంది.

**అత్యాచారం, పోక్సో కేసుల వివరాలు**

| సంవత్సరం | అత్యాచారం | పోక్సో |
|---|---|---|
| 2022 | 28 | 20 |
| 2023 | 27 | 21 |
| 2024 | 17 | 18 |
| మొత్తం | 72 | 59 |

**గుడ్ టచ్.. బ్యాడ్ టచ్..**

ఏడాది కిందట జిల్లా కేంద్రంలో ఓ బాలికను ఓ వ్యక్తి అసభ్యకరంగా తాకాడు. ఆ బాలిక ఇంట్లో ఈ విషయం చెప్పినా తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి మొగ్గుచూపలేదు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా షీ టీంల ద్వారా పోలీసులు పాఠశాలలకు వెళ్లి బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటి? అన్న అంశాలపై వివరిస్తూ.. అలాంటి వారి పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలి? ఎవరికి ఫిర్యాదు చేయాలి? అంటూ చెబుతున్న నేపథ్యంలో ఏడాది కిందట తనకు జరిగిన ఘటనను బాధిత బాలిక పోలీసుల దృష్టికి తీసుకురావడంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో ఓ బాలికను అత్యాచారం చేసిన బాలుడిని సైతం పోలీసులు అరెస్టు చేసి జువైనల్ హోంకు తరలించారు. ఇలా కుమురంభీం జిల్లా వ్యాప్తంగా మూడేళ్లలో 72 అత్యాచారం కేసులు నమోదు కాగా.. మరో 60 మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డ పోక్సో కేసులుగా నమోదయ్యాయి.

ఈ కేసులన్నీ ప్రస్తుతం విచారణ దశల్లో ఉన్నాయి.

**జిల్లాలో జరిగిన సంఘటనలు**

**కౌటాల:** ఈ ఏడాది జూన్ 30న సిర్పూర్(టి) మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల చిన్నారి స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి యువకుడిని రిమాండ్‌కు తరలించారు.

- గత ఆగస్టు నెల 31న జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై ఓ ఆటో డ్రైవర్ అత్యాచార యత్నం చేశాడు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో ముఖంపై దాడి చేశాడు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశాడు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసులు ఆటో డ్రైవర్‌ను ఈ నెల 3న అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.
- చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన లంబోటి వెంకటేశ్ (28) ఏడో తరగతి విద్యార్థిని ఫోటోలు తీసి బెదిరిస్తూ పలుమార్లు లైంగిక దాడి చేశాడు. ఈ నెల 22న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి 24న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
- కాగజ్‌నగర్ పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన రీమా యాదవ్‌పై ఈ నెల 20న ఐదుగురు దాడి చేశారు. పట్టణానికి చెందిన పురుషోత్తం తన మొబైల్‌లో వ్యక్తిగత వీడియోను ఉంచుకున్నాడనే సమాచారంతో బాధిత మహిళ ఎన్టీఆర్ చౌక్‌లోని అతడి షాపు వద్దకు వెళ్లి వీడియో తొలగించాల్సిందిగా కోరింది. నాలుగు రోజులైనా ఆ వీడియోను డిలీట్ చేయకపోవడంతో సదరు మహిళ తన భర్తతో కలిసి పురుషోత్తం షాపు వద్దకు వెళ్లి వీడియో డిలీట్ చేయాలని కోరింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి పురుషోత్తం, నాయకపు శివాగౌడ్, నవీన్‌గౌడ్, భరత్, అవినాశ్ కలిసి సదరు మహిళ, ఆమె భర్తపై దాడి చేశారు. దాడి చేసిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా అత్యాచారం, పోక్సో కేసులను సత్వరం విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని బాధిత వర్గాలు కోరుతున్నాయి.

### నిందితుడిని శిక్షించాలని విద్యార్థుల రాస్తారోకో

**ఆసిఫాబాద్‌రూరల్:** బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని విద్యార్థులు శనివారం పాఠశాల నుంచి ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంటసేపు రాస్తారోకో నిర్వహించడంతో రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విషయం తెలుసుకున్న సీఐ సతీష్ సిబ్బందితో వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

**నిందితుడి అరెస్టు**

బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 65(1) పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సతీష్ తెలిపారు. కాగా నిందితుడికి భార్య, కుమారుడు ఉన్నారని, అతనికి దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

**ఉరిశిక్ష విధించాలి..**

బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి ఉరిశిక్ష విధించాలి. బాలికలకు రక్షణ లేకుండ పోతోంది. పాఠశాల సమీపంలో వైన్‌షాపులు లేకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. బాలికలకు రక్షణ కల్పించాలి.



– హారిక, తొమ్మిదో తరగతి, బూరుగూడ

**బాలికలకు రక్షణలేదు..**

పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. పట్టపగలే ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరం. బాలికల రక్షణ లేకుండ పోతోంది. నిందితున్ని కఠినంగా శిక్షిస్తే ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉంటుంది.



– బిందు, పదోతరగతి, బూరుగూడ

**పిల్లలపై దృష్టి ఉంచాలి**

మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే, చిన్న పిల్లలను లైంగికంగా వేధిస్తే కఠిన శిక్షలు తప్పవు. మహిళల రక్షణ చట్టాల పై షీ టీం, భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి ఉంచాలి.



– కరుణాకర్, డీఎస్పీ

## రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

**ఆసిఫాబాద్:** లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 4,867 కేసులు పరిష్కరించారు. వీటిలో 4,280 ఈ చాలాన్ కేసులుండగా రూ.10,62,590 జరిమానా విధించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారం**

**సిర్పూర్(టి):** లోక్ అదాలత్‌లతో కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు పరిధిలోని సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ టౌన్, రూరల్, ఈజ్‌గాం, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, బెజ్జూర్ పోలీసుస్టేషన్‌లలోని 340 కేసులను పరిష్కరించి రూ.16,57,620 జరిమానా విధించారు.

### మొబైల్ వాహన సేవలు భేష్



మొబైల్ వాహనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్

**కెరమెరి:** సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న మొబైల్ వాహనం పనితీరు ఎంతో భేష్‌గా ఉందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జోడేఘాట్‌లో శనివారం నిర్వహించిన కుమురం భీం వర్ధంతి సన్నాహక సమావేశంలో పాల్గొన్న వారు మ్యూజియం బయట ఉన్న వాహనాన్ని పరిశీలించారు.


### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని 33/ 11 కెవి ఎస్ఎస్ ఆసిఫాబాద్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని పట్టణ సహాయక ఇంజినీ ర్ సదాశివ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## జిల్లా ఓటర్లు @ 3,48,370

- తుది జాబితా విడుదల చేసిన అధికారులు

**ఆసిఫాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ఓటరు ముసాయిదా తుది జాబితా విడుదల చేసింది. జిల్లాలోని 335 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 3,48,370 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. వీరిలో 1,74,297 మంది పురుషులు, 1,74,057 మంది మహిళలు, 16 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. శనివారం మార్పులు చేర్పులతో ఓటరు ముసాయిదాను జిల్లాలోని అన్ని తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం అర్హులైన యువతకు కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో యువతీ, యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకున్నారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 14 నుండి 21 వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు తెలిపే అవకాశం కల్పించారు. ఈ నెల 26 వరకు ఓటరు జాబితా పరిశీలన అనంతరం శనివారం తుది జాబితా ప్రకటించినట్లు డీపీవో భిక్షపతి తెలిపారు.



**పెరిగిన ఓటర్లు 79,412 మంది**

గత పంచాయతీ ఎన్నికలు 2018 ఓటరు జాబితాతో పోలిస్తే జిల్లాలో 79,453 మంది ఓటర్లు పెరిగారు. గత పంచాయతీ ఎన్నికలకు ముందు జిల్లాలో 2,68,917 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,36,074 మంది పురుషులు, 1,32,810 మంది మహిళలు, ఇతరులు 33 మంది ఉన్నారు.

**మండలాల వారీగా ఓటర్లు**

| మండలం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 14762 | 14979 | 0 | 29741 |
| బెజ్జూర్ | 11608 | 11878 | 2 | 23488 |
| చింతలమానెపల్లి | 12016 | 11684 | 0 | 23700 |
| దహెగాం | 10858 | 10894 | 0 | 21752 |
| జైనూర్ | 11779 | 12235 | 0 | 24014 |
| కాగజ్‌నగర్ | 22387 | 21720 | 2 | 44109 |
| కెరమెరి | 11984 | 11665 | 1 | 23650 |
| కౌటాల | 13597 | 13298 | 1 | 26896 |
| లింగాపూర్ | 5018 | 5359 | 0 | 10377 |
| పెంచికల్‌పేట్ | 6231 | 6044 | 0 | 12275 |
| రెబ్బెన | 14381 | 13950 | 0 | 28331 |
| సిర్పూర్(టి) | 10892 | 10964 | 1 | 21857 |
| సిర్పూర్(యూ) | 5748 | 6326 | 2 | 12076 |
| తిర్యాణి | 8738 | 9122 | 4 | 17864 |
| వాంకిడి | 14298 | 13939 | 3 | 28240 |
| మొత్తం | 1,74,297 | 1,74,057 | 16 | 3,48,370 |

## భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

- గతం కంటే ఎంతో భిన్నంగా ఉండాలి
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రె



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రె, వేదికపై ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో

**కెరమెరి(ఆసిఫాబాద్):** అక్టోబర్ 17న జోడేఘాట్‌లో కుమురం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా అన్నారు. శనివారం జోడేఘాట్‌లో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి అధికారులు, ఆదివాసీ నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హట్టి నుంజి జోడేఘాట్ వరకు ప్రతీ అరగంటకో బస్సు నడపాలని, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ నుంచి కూడా ప్రత్యేక బస్సులు వేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. 10 ట్యాంకర్లతో నీటిని అందించాలని, అవసరమైన వాటర్ ప్యాకెట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్టాళ్లను ఏర్పాటు చేసి ఐటీడీఏ అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దర్బార్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఏర్పడకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక వైద్యులచే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. మరో రెండు, మూడు సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తామని, అప్పటి వరకు అన్ని పనులు పూర్తి కావాలన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి జనం వస్తున్నందన ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. హెలిప్యాడ్ స్థలం, స్టేజీ, దర్బార్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ భీం వర్ధంతికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉందన్నారు. జోడేఘాట్ నుంచి వావుదాం వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమం నడిచే వేళ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వల్లే కుమురం భీంకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందని, జోడేఘాట్ అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో భీం మనుమడు కుమురం సోనేరావు, అడిషనల్ ఎస్పీ కరుణాకర్, డీడీ రమాదేవి, ఏటీడీఏ పురుషోత్తం, డీపీవో భిక్షపతి, డీఆర్డీఏ పీడీ దత్తారావు, ఐకేపీ ఏపీడీ రామకృష్ణ, సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషా, మాజీ జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, కన్వీనర్ పెందోర్ మోతీరాం, గిరిజన నాయకులు కనక ప్రభాకర్, రాజు, పెందోర్ సుధాకర్, రాజు ఆత్రం లక్ష్మణ్ మడావి రఘునాథ్, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.



సమాధిపై పూలు చల్లుతున్న కలెక్టర్, అధికారులు, ఎమ్మెల్యే



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రె, ఎమ్మెల్యేలు

## క్లుప్తంగా

### గంజాయి మొక్కలు పట్టివేత



మొక్కలు స్వాధీనం చేసుకుంటున్న సీఐ

**ఇచ్చోడ:** మండలంలోని గుబ్బ గ్రామంలో పత్తి పంటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పక్కా సమాచారంతో సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. సీఐ కథనం ప్రకారం..కోవ హనుమంత్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన పెందుర్ మానిక్యరావు కౌలు తీసుకుని సాగు చేస్తున్నాడు. పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న 30 మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ.45 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### బైక్ దగ్ధం



దగ్ధమైన బైక్

**భీమిని:** కన్నెపల్లి మండలం నాయకునిపేట పంచాయతీ పరిధిలోని మొక్కంపల్లి (కుర్మగూడెం) గ్రామంలో శనివారం పల్సార్ బైక్ దగ్ధమైంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గాదర్ల మహేశ్ తన ఇంటి ముందు షెడ్డులో బైక్ పెట్టాడు. ఒగ్గు కథ చెప్పడానికి చెన్నూర్‌కు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా బైక్ నుంచి భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో మహేశ్ తల్లి ప్రేమల బయటికి వచ్చి చూడగా అదే గ్రామానికి చెందిన గాదర్ల రాజేశ్ పరిగెడుతూ కనిపించడం చూసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

### యువకుడి బైండోవర్

**నెన్నెల:** సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌పై అభ్యంతకర పోస్టుపెట్టిన ఓ వ్యక్తిని సోమవారం తహసీల్దార్ సబ్బ రమేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొత్తూర్‌కు చెందిన యువకుడు తలండి నాగేశ్ ఇటీవల సీఎం, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జలీల్ ఫిర్యాదు మేరకు బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# లాఠీఎత్తారు..!

- మంచిర్యాల పోలీస్‌స్టేషన్ సాక్షిగా ఇరువర్గాల దాడి
- ఈనెల 23న ఘటన
- వరుస దాడులతో జనం బెంబేలు



గతేడాది సెప్టెంబర్‌లో బైపాస్‌రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద దాడులు చేస్తున్న ఓ వర్గం

**మంచిర్యాలక్రైం:** ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలుతో పోలీసులు పెద్దగా లాఠీలకు పని చెప్పినా దాఖలాలు లేవు. చాలాకాలం తర్వాత ఖాకీలు లాఠీలకు పనిచెప్పినా వీడియో వైరల్ అయింది. జిల్లాకేంద్రంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బైపాస్ రోడ్‌లో ఈనెల 23న అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు వద్ద పనిచేసే మేర సంజీవ్‌పై జరిగిన దాడి కేసులో పోలీసులు కొందరిని స్టేషన్‌కు పిలిపించినట్లు సమాచారం. కేసులో సంబంధం లేని వ్యక్తులను పిలవడంతో ఓ వర్గానికి చెందిన వారు అక్కడికి వెళ్లారు. మరో వర్గానికి చెందిన వారు అక్కడే ఉన్నారు. స్టేషన్ సాక్షిగా రెండువర్గాల మధ్య మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు వారిపై లాఠీ ఝుళిపించారని తెలిసింది.

**వరుస దాడులు..**

జిల్లాలో వరుసగా గ్యాంగ్‌లు, ఇరువర్గాలు పరస్పరం దాడులతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్టేషన్‌కు వచ్చిన యువకులపై లాఠీ ఝులిపించడం, గొడవలు జరుగుతుంటే శాంతిభద్రతలు పరిరక్షణలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ కాస్త..మంచిర్యాల పోలీసుల తీరుతో 'పోకిరి'పోలీసింగ్ విధానంగా మారిందనే విమర్శలున్నాయి. 2022 జిల్లా కేంద్రంలో ఎల్‌ఐసీ కాలనీలో ప్రారంభమైన గ్యాంగ్ దాడి మొదలుకొని వరుస దాడులు ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ వరకు చేరుకోవడం, ఈ దాడుల్లో ఖాకీలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

- జిల్లాకేంద్రంలో ఇప్పటికే గ్యాంగ్ లీడర్ల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఓ వర్గానికి రాజకీయ, పోలీసుల బలం మెండుగా ఉన్నట్లు సమాచారం. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరును అరికట్టడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. రాజకీయ బలం, ధన భలం ఉన్నవారికే పోలీస్ యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.
- 2022, మే నెలలో ఎల్‌ఐసీ కాలనీలో ఓ భూవివాదంలో ఇంటి నిర్మాణం తొలగించడానికి ఓ ముఠా వీరంగం సృష్టించింది. 10 మంది మద్యం తాగి క్రికెట్ బ్యాట్లు, గడ్డపార పట్టుకుని హల్‌చల్ చేశారు. స్థానికులు 100 డయల్‌కు ఫోన్ చేయడంతోపోలీసులు వచ్చేసరికి పారిపోయారు.
- అదేనెలలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రెండు వర్గాల మధ్యం జరిగిన దాడిలో ఒకరు తీవ్ర గాయలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి నుంచి వరుసగా గ్యాంగ్‌లీడర్ల ఆరాచకాలు రోజురోజుకు పెట్రేగిపోతున్నాయి. ఏకంగా పోలీస్‌స్టేషన్ వరకు చేరుకుందంటే జిల్లాలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.
- గతేడాది సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జనం రోజున మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య గొడవ పెద్దదిగా మారింది. బైపాస్ రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటిపై క్రికెట్ బ్యాట్లు, ఇనుప రాడ్లతో రెండు వర్గాలు దాడులు చేసుకుని బీభత్సం సృష్టించాయి.
- 2024 మే 14న ఐబీ చౌరస్తా సమీపంలో మా విందు హోటల్ ఎదుట రెండు వర్గాల దాడుల్లో ఇరువురికి గాయాలయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా పలువురిపై కేసులు నమోదైంది.
- గత జూన్ 2న బీఆర్‌ఎస్ యువ నాయకుడు గడప రాకేశ్‌పై ఓ వర్గానికి చెందిన గ్యాంగ్ దాడి చేసింది. దాడిచేసిన వారిపై కేసులు గుట్టుచప్పుడు కాకుండా కేసు నమోదు చేశారు.
- ఈనెల 23న బైపాస్ రోడ్‌లో కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద మేర సంజీవ్‌పై బీఆర్‌ఎస్ యువనాయకుడు గడప రాకేశ్ అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఆత్మరక్షణ కోసం సంజీవ్ ఎదురు దాడి చేయగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఈనెల 25న పోలీస్‌స్టేషన్ ఆవరణలో రెండు వర్గాలు దాడి చేసుకున్నాయి. పోలీసుల లాఠీ ఛార్జ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

### చర్యలు తీసుకుంటాం



జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిసే చర్యలు తీసుకుంటాం. రెండువర్గాల మధ్య దాడులు, ఉనికి చాటుకునేందుకు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతున్నారు. రాజకీయాలకతీతంగా కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్, పీడీయాక్టు నమోదు చేస్తాం. ఈనెల 25న పోలీస్‌స్టేషన్ లోపల రెండువర్గాలు దాడి చేసుకున్న విషయం నా దృష్టికి రాలేదు.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

## వివాహితపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**కుభీర్:** వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. కుభీర్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని దోడర్నా గ్రామానికి జాదవ్ సాహెబ్రావ్ గత ఆరునెలలుగా లైంగిక వాంఛ తీర్చాలని ఓ వివాహితను వేధించాడు. ఈ విషయం తెలియడంతో ఆమె భర్త అతన్ని హెచ్చరించాడు. ఈనెల 26న వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో జాదవ్ సాహెబ్రావ్ ఆమెపై లైంగికదాడి చేసి ఆమె ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెండు బృందాలు ఏర్పాటు చేసి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రెండు ఫోన్లు, నిందితుడి బట్టలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై పి.రవీందర్, పోలీసులను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

## బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బ్రాంచ్ మెడల్ సాధించిన అనన్య

**మంచిర్యాలటౌన్:** సికింద్రాబాద్‌లో శనివారం జరిగిన పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ తెలంగాణ స్థాయి ఓపెన్ టోర్నమెంట్‌లో అండర్–17 విభాగంలో మంచిర్యాల బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అనన్య సెమీఫైనల్‌కు చేరి తృతీయస్థానంలో నిలిచినట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాంచ్ మెడల్‌ను సాధించిన అనన్య జాతీయస్థాయి జేబీసీ టోర్నమెంట్‌కు అర్హత సాధించగా, ఆమెతోపాటు కోచ్ నరేందర్‌ను అసోసియేషన్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేశ్‌రెడ్డి, మధు అభినందించారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాత శిశువుమృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

**భైంసాటౌన్:** పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి చెందింది. బాధితుల కథనం ప్రకారం.. కుభీర్ మండలం రాజురా గ్రామానికి చెందిన కొట్టె ఆనందకు నెలలు నిండడంతో గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అదేరోజు వైద్యులు పరీక్షించి ప్రసవం చేశారు. దీంతో ఆడ శిశువు జన్మించగా, శనివారం మృతిచెందింది. రెండు రోజులు ఆరోగ్యంగా ఉన్న శిశువు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందంటూ బంధువులు ఆరోపించారు. ఈ విషయమై కొద్దిసేపు ఆస్పత్రిలో ఆందోళన నెలకొనడంతో పోలీసులు చేరుకుని సముదాయించారు. అనంతరం మృతశిశువును బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ విషయమై వైద్యుడు అనిల్‌ను సంప్రదించగా, శిశువుకు పాలు తాపించే క్రమంలో తల్లి అజాగ్రత్త కారణంగా శిశువు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

## వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి



పోలీసుల అదుపులో నిందితులు

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని సాయికుంటలోని సంతోష్‌నగర్ కాలనీలో వ్యభిచారం గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. పక్కా అందిన సమాచారంతో సీఐ రాజ్‌కుమార్, ఎస్సై ఉపేందర్ తమ సిబ్బందితో కలిసి కాలనీలోని అద్దె ఇంటిపై దాడి చేశారు. ఇందులో ఒక మహిళతోపాటు సీతారాంపల్లికి చెందిన బోలెం శ్రీకాంత్, నిర్వాహకుడు ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం జక్కులపల్లికి చెందిన తోట మహేందర్‌ను అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

## ఆర్‌ఎంపీ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్

**లక్సెట్టిపేట:** వైద్యం వికటించి యువకుడి మృతికి కారణమైన దండేపల్లి మండలం కన్నెపల్లికి చెందిన ఆర్‌ఎంపీని శనివారం రిమాండ్ తరలించినట్లు సీఐ నరేందర్, ఎస్సై సతీశ్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం కొత్త కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బత్తుల మధుకర్ (26)కు జ్వరం వచ్చింది. గ్రామంలో ఆర్‌ఎంపీ బొడ్డు శ్రీనివాస్ అతనికి చికిత్స అందించాడు. మూడు ఇంజక్షన్లు రెండు గ్లూకోజ్‌లో కలిపి సెలైన్ ఎక్కించి వైద్యం చేయడంతో యువకుడికి చలిజ్వరం వచ్చింది. ఆర్‌ఎంపీ అతన్ని మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు పరిశీలించి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి రెఫర్ చేశారు. బ్రెయిన్ డెడ్ తర్వాత కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ ఈనెల 24న మృతిచెందాడు. ఆర్‌ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించి తన కుమారుడు మృతిచెందాడని తండ్రి రాజలింగయ్య ఫిర్యాదుతో కేసు నమోదైనట్లు వారు తెలిపారు.

## గేదెలను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి



ప్రవీణ్ (ఫైల్)

**జైపూర్:** మండలంలోని ఇందారం రాజీవ్ రహదారిలో గల రైల్వేబ్రిడ్జిపై గేదెలను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ సెకండ్ ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన సిర్రం ప్రవీణ్ (25), పొన్నం అజయ్ బైక్‌పై శుక్రవారం మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి రాత్రి ఇంటి వెళ్తుండగా గేదెలను వేగంగా ఢీకొట్టడంతో ప్రవీణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై తెలిపారు.

## అరచేతిలో భగత్‌సింగ్ ముఖచిత్రం



**తాంసి:** మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన యువకుడు గట్టు రాజు తన అరచేతిపై వినూత్నంగా భగత్‌సింగ్ ముఖచిత్రాన్ని వేసుకుని అబ్బురపరిచాడు. శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయనపై ఉన్న అభిమానంతో అరచేతిలో భగత్‌సింగ్ ముఖ చిత్రాన్ని వేసుకుని ఇలా నివాళిర్పించాడు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



వృద్ధుల చట్టాలను వివరిస్తున్న రిటైర్డ్ జడ్జి

**మంచిర్యాలటౌన్:** వృద్ధుల కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రిటైర్డ్ జడ్జి కె.రాజన్న అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ జడ్జి మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు వయోవృద్ధులను కుమారులు, కుమార్తెలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. రిటైర్డ్ డిప్యూటీ జీఎం రామస్వామి, రాజమల్లు, అడ్వొకేట్ లచ్చన్న, సందాని, సురేందర్, రెస్పాన్స్ ఆఫీసర్ ఫర్జానా బేగం, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ సౌజన్య పాల్గొన్నారు.

## టీచర్ల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలి



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జిల్లా బాధ్యులు

**మంచిర్యాలఅర్బన్:** పాఠశాల విద్య–ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) బాధ్యులు కోరారు. శనివారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 25ను సవరించిన తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. బదిలీ అయి రిలీవ్ చేయని టీచర్లను వెంటనే రిలీవ్ చేసి పాఠశాలలో సర్దుబాటు చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. బోధనేతర పనులు, పాఠశాల పర్యవేక్షణ నిమిత్తం ప్రతీ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. యూఎస్‌పీసీ బాధ్యులు రాజావేణు, జయకృష్ణ, నాగలక్ష్మి, కిరణ్, కుమారస్వామి, కళావతి, గంగాధర్, అంజనేయులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

**పాతమంచిర్యాల:** సీఐటీయూ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట శనివారం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక చట్టాల అమలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవో రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాశ్, దాసరి రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు మహేందర్, మున్సిపల్ కార్మికులు, సంక్షేమ హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

**శ్రీరాంపూర్:** రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ. 33 వేల కోట్లను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆర్కే 6, ఆర్కే 7 గనులపై గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణికి రూ.29 వేల కోట్ల బకాయి పెడితే తాజాగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మరో రూ. 4 వేల కోట్ల బకాయి పెంచిందన్నారు. ఈ బకాయి డబ్బులు సింగరేణి చెల్లిస్తే సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అంతేకాకుండా సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ఇది పోవాలన్నారు. సింగరేణి సంస్థకు నష్టం జరిగేలా ప్రభుత్వం గానీ, యాజమాన్యం గానీ ఎలాంటి నిర్ణయం తీసుకున్న కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, కార్యదర్శి సారయ్య నాయకులు గొర్రె నరసయ్య, అఫ్రోజ్ ఖాన్, సంఘం సదానందం, బీర రవీందర్, చంద్రశేఖర్, చిలుక రామచందర్, రేగుల శంకర్, దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

## పవర్ ప్లాంటులో కార్మికుల ఆందోళన

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోవాలి
- రూ.15 లక్షలు, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలిస్తామని అధికారుల హామీ



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్

**జైపూర్:** జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా విధుల్లోకి తీసుకోవడం లేదని మనస్తాపంతో మాసు బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పరిహారంతోపాటు కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని కార్మికులు, నాయకులు ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. సంఘాల నాయకులు, బాధిత కుటుంబీకులతో పవర్‌మేక్ కంపెనీ అధికారులు, ఎస్సై శ్రీధర్ సమక్షంలో చర్చలు జరిపారు. పవర్‌మేక్ కంపెనీ నుంచి తక్షణ సాయం రూ.20వేలు అందించడంతోపాటు రూ.15 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్నారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించజేశారు.

## 3 నుంచి బాసరలో దసరా వేడుకలు



బాసర సరస్వతి అమ్మవారు..

**బాసర:** బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఈవో విజయరామారావు తెలిపారు. వేడుకల్లో భాగంగా అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో అలంకరిస్తామన్నారు. మొదటిరోజు శైలపుత్రిగా. రెండో రోజు బ్రహ్మచారిణిగా, మూడవరోజు చంద్రఘటా అలంకరణలో, నాలుగోరోజు కూష్మాండ అలంకరణ, ఐదోరోజు స్కదమాతగా, ఆరోరోజు కాత్యాయనిగా, ఏడో రోజు కాళరాత్రిగా, ఎనిమిదో రోజు మహాగౌరీగా, తొమ్మిదోజు సిద్ధిధాత్రిగా అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. నవరాత్రుల సందర్భంగా బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేడుకలకు రావాలని ఇప్పటికే మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆహ్వానం అందించినట్లు తెలిపారు.

## ఐటీడీఏ ఉద్యాన నర్సరీ సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

**ఉట్నూర్‌రూరల్:** మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రెయినీ) అజ్మీర సంకేత్ శనివారం సందర్శించారు. నర్సరీలో మొక్కల రక్షణకు తీసుకుంటున్న చర్యలను గురించి ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేస్తున్న పసుపు, టమాట, వరి, జామ తోటలను పరిశీలించారు. హెచ్‌ఎం సుదీర్‌కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, నర్సరీ టెక్నికల్ అస్టింట్ అర్పిత ఉన్నారు.

## అంతర్జాతీయ పోటీల్లో రామకృష్ణ ప్రతిభ

**మందమర్రిరూరల్:** సౌత్ అమెరికాలోని కొలంబియాలో ఈనెల 15 నుంచి 20 వరకు అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన రామకృష్ణ డబ్ల్యూపీఎస్ తరపున రెస్క్యూ టీమ్ ద్వారా వైస్ కెప్టెన్‌గా పాల్గొన్నాడు. 8 దేశాల నుంచి 21 జట్లు పాల్గొనగా, రామకృష్ణ జట్టు ఓవరాల్‌గా ద్వితీయ స్థానం సాధించింది. కేకే–5 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లపల్లి తిరుపతి–విజయలక్ష్మి దంపతుల కుమారుడు రామకృష్ణ శనివారం మొదటి సారిగా ఇక్కడకు వచ్చాడు. తల్లిదండ్రులు అతన్ని ఓపెన్‌టాప్ వాహనంలో బ్యాండ్ మేళాల మధ్య ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.